ప్రజాశక్తి

బుధవారం 27 డిసెంబర్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

అట్టహాసంగా ఆడుదాం ఆంధ్ర ఆరంభం

క్రీడాకారులతో కలిసి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఆడిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరు సమీపంలోని నల్లపాడు వద్ద ఉన్న లయోలా పబ్లిక్ స్కూల్ క్రీడ మైదానంలో రాష్ట్ర వ్యాప్తంగా 'ఆడుదాంఆంధ్ర-2023' పోటీలను ప్రారంభోత్సవం మంగళవారం అట్టహాసంగా జరిగింది. ఉత్సాహ భరిత వాతావరణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. క్రీడా కారులతో ముచ్చటించి వారితో కలిసి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఆడారు. శాప్ పతాకాన్ని, జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. క్రీడాస్ఫూర్తితో పనిచేస్తామని క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. క్రీడా జ్యోతిని వెలగించి క్రీడాకారులకు అందించారు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్‌తో కలిసి క్రీడా జ్యోతిని తిరిగి అందుకున్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మిటన్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు కిట్లను అందించారు. మంత్రి రోజా, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, శ్యాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డితో కలిసి క్రికెట్ ఆడారు. ప్రభుత్వ, కాలేజీ మైదానాలు, యూనివర్సిటీ గ్రౌండ్లు, మున్సిపల్ స్టేడియంలు, జిల్లా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను గుర్తించి అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా సిఎం ప్రకటించారు. రాబోయే సంవత్సరాల్లో క్రీడాభివృద్ధికి అడుగులు ఇంకా వేగంగా పడతాయన్నారు. ప్రతి స్కూల్లోనూ క్రీడలకు ప్రోత్సహం ఉంటుందని, ప్రతి పాఠశాలకు కిట్లు అందిస్తామని చెప్పారు. క్రీడల ద్వారా అన్ని వ్యాధులను నయం చేసుకోవచ్చునన్నారు.

ఆరోగ్య సమస్యలపై ఆర్థిక సాయానికి భరోసా

నల్లపాడు హెలిపాడ్ వద్ద సిఎం జగన్ పలువురు నుంచి వినతులు స్వీకరించారు. వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారికి మందులు, వైద్య, ఇతర అవసరాల కోసం వచ్చిన వినతుల పట్ల సానుకూలంగా

▶ 2లో

బడ్జెట్ ఆమోదం కోసం..

నేడు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరగనుంది. చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్న సమావేశంలో 2023-24 సవరణ బడ్జెట్, 2024-25 అంచనాల బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నాయి. ఈ పరిస్థితులు స్థానిక సంస్థలు ముందస్తుగానే బడ్జెట్ ప్రతిపాదనలు ఆమోదించి పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా పరిషత్ అధికారులు ప్రతిపాదనలు సభ్యుల ఆమోదంకోసం రూపొందించారు.

ప్రధానంగా పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, వివిధ పద్దుల ద్వారా వచ్చే ఆదాయం, సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిపాదనలు రూపొందించనున్నారు. బడ్జెట్ ఆమోదం తరువాత సభ్యులు పలు అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఇటీవల సంభవించిన తుపాను తరువాత రైతులకు ఎదుర్కొంటున్న సమస్యలు, రబీ సాగులో ఇబ్బందులు, సాగునీటి ఎద్దడి తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉంది. డెల్టాలో రబీలో జొన్న, మొక్కజొన్న సాగు వద్దని, కేవలం మినుము,పెసర

▶ 2లో

పల్నాడులో 50 శాతం తగ్గిన నేరాలు, ప్రమాదాలు : డిజిపి 3పేజీ

వినదాయకం.. వినోదాత్మకం.. ఆకట్టుకుంటున్న నంది నాటకోత్సవాలు

తాడేపల్లిలో మద్దతుగా మాట్లాడుతున్న ఆంధ్ర మాల్యాద్రి

మాటలు మనకు... మూటలు వాళ్లకు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెబాట

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు, సమాన పనికి సమాన వేతనం తదితర డిమాండ్లతో గుంటూరు జిల్లాలో మంగళవారం నుండి సమ్మెబాట పట్టారు. సమగ్రశిక్ష కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరం ఏర్పాటు చేసి ఆందోళన చేపట్టారు. మరోవైపు పల్నాడు జిల్లాలో సమ్మె కొనసాగుతుండగా మంగళవారం ఉద్యోగులు భిక్షాటనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు సమ్మె శిబిరంలో నాయకులు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, పీఆర్సీ అమలు చేయకుండా, నెలలు తరబడి వేతనాలు విడుదల చేయకపోవడం దుర్మార్గమని మినిమం ఆఫ్ టైమ్ స్కేల్‌పై జీఓలు మీద జీవోలిచ్చి అమలు చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాలతో మాట్లాడే సంప్రదాయాన్ని గాలికి వదిలేశారని, ఉద్యోగుల మధ్య విభేదాలు, విభజన సృష్టించే విధానాలు

గుంటూరు సమ్మె శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు.. మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్

▶ 2లో

మోత మోగించిన అంగన్‌వాడీలు

గరిటెలతో ఖాళీ కంచాలను కొట్టి నిరసన - 15వ రోజుకు సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర డిమాండ్లతో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారంతో 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గుంటూరు కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఖాళీ ప్లేట్లు మోగించి వినూత్న నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సమ్మె శిబిరం కొనసాగింది. గుంటూరు సమ్మె శిబిరంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, జనసేన నాయకులు కోలా అంజి, జి.రోశయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుధీర్, ఎస్‌టియు రాష్ట్ర మాజీ అధ్యక్షులు జోసఫ్ సుధీర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, సుబ్బారెడ్డి పాల్గొని సమ్మెకు సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీలు రెండు వారాలకుపైగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించకపోవటం సరికాదన్నారు. నిత్యావసరాలు, గ్యాస్, పెట్రోలు, డీజిల్ అన్ని ధరలూ పెరిగాయని, కుటుంబ పోషణ ఖర్చులూ పెరిగాయని

గుంటూరు సమ్మె శిబిరంలో ప్లేట్లు మోగిస్తున్న అంగన్‌వాడీలు

▶ 2లో

పదవుల కోసం నేనెప్పుడూ వెంపర్లాడ లేదు : మంత్రి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

రాజకీయాల్లో పదవులు ముఖ్యం కాదని విలువలే శాశ్వతమైనవని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో వంగవీటి మోహనరంగ 35వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలేసి నివాళుర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మోహన రంగాను పొట్టన పెట్టుకుంది టిడిపియేనని, ఆ పార్టీని మళ్లీ ఓడించాలని అన్నారు. రంగాను చంద్రబాబే హత్య చేయించారని కన్నా లక్ష్మీనారాయణ చేసిన విమర్శలను టిడిపి నాయకులు మరచారా? అని ప్రశ్నించారు. పదవులకు కోసం పార్టీ మారితే సమాజం క్షమించదని, పదవుల కోసం ఎప్పుడూ తాను వెంపర్లాడలేదని అన్నారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ ఎన్.రాజానారాయణ, పి.సూరిబాబు, సహారా మౌలాలి, శివయ్య, ఎ.శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రాజుపాలెం : స్థానిక జనసేన కార్యాలయం వద్ద ఆ పార్టీ మండల అధ్యక్షులు టి.నరసయ్య, ఉపాధ్యక్షులు బి.హనుమంతరావు, గ్రామ అధ్యక్షుడు ఎన్.కోటేశ్వరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

అభివృద్ధి చేయడం చేతగాని అసమర్థ ఎమ్మెల్యే బొల్లా : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - నూజెండ్ల, వినుకొండ

వైసిపి మాఫియా రాజ్యంలో ప్రజల భవిష్యత్తు నాశనమైందని, సైకో ప్రభుత్వం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు విమర్శించారు. అభివృద్ధి చేతగాని అసమర్థ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడని అన్నారు. మండలంలోని రాముడుపాలెం తండాలో బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి టిడిపి మండల అధ్యక్షులు మీసాల మురళికృష్ణ అధ్యక్షత వహించగా బి.అంజిరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కంటే కూడా మెరుగైన పాలన అందిస్తానని రాష్ట్ర ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని టిడిపి పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నిరుద్యోగ యువతను జగన్ దగా చేశారని, జాబ్ క్యాలెండర్ ఇస్తానని చెప్పి ఇవ్వలేదని, ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదని విమర్శించారు. రూ.1.14 లక్షల కోట్ల ఎస్సీ ,ఎస్టీ ,బీసీ, మైనార్టీలకు చెందిన కార్పొరేషన్ నిధులు దారి మళ్లించారని అన్నారు. మద్యపానం నిషేధం హామీని విస్మరించి మహిళలను దగా చేశారన్నారు.

వాహనాలు ఢీ - ఒకరు మృతి

ప్రజాశక్తి - తెనాలి : ఎదురెదురుగా వస్తున్న లారీ, టాటా ఏస్ ఆటో ఢీ కొనడంతో డ్రైవర్ మృతి చెందాడు. తెనాలి విజయవాడ మార్గంలో నందివెలుగు-కంచర్లపాలెం గ్రామాల మధ్య ఎదురెదురుగా వస్తున్న లారీ, టాటా ఏస్ ఆటో ఢీకొన్నాయి. డ్రైవింగ్ సీట్లో చిక్కుకుపోయిన వ్యక్తి మృతి చెందాడు. మృతుడు నందివెలుగుకు చెందిన తోట పవన్‌గా గుర్తించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెబాట

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఒకే క్యాడర్ ఉద్యోగులకు రకరకాల వేతనాలు చెల్లిస్తున్నారని, పాత వారికి జీతం పెంచకుండా, కొత్తగా నియమితమైన వారికి జీతం పెంచే సంప్రదాయాన్ని ప్రారంభించారని విమర్శించారు. పార్ట్ టైం పేరుతో తక్కువ జీతాలిచ్చే విధానాలను అమలు చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీలు గుప్పించి మాట తప్పారని విమర్శించారు. పెరిగిన ధరలతో ఉద్యోగుల కుటుంబాలు జీవనం సాగించటం కష్టంగా మారిందన్నారు. ఎంఇఒ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిఆర్‌ఎంటిలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, అకౌంటెంట్లు, మెసెంజర్లు, సహిత విద్య రిసోర్స్ పర్సన్లు, భవిత ఆయ, ఇలా ఆఫీసులు, స్కూల్స్‌లో వివిధ రకాల విధుల్లో ఉన్న ఉద్యోగులందరి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమ్మెకు యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు జోసెఫ్ సుధీర్‌బాబు, అధ్యక్షులు పెదబాబు, ఎపిటియఫ్ జిల్లా అధ్యక్షులు బసవలింగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, ఏపి గవర్నమెంట్ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా, ఎన్‌జిఒ నాయకులు మూర్తి, పెన్షనర్ల సంఘం నాయకులు నాగరాజు, సమగ్ర శిక్షా ఏవో శ్రీనివాసరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజా, నాయకులు టి.రాధ, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ జెఎసి జిల్లా చైర్మన్ బి.లక్ష్మణరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా జెఎసి జిల్లా నాయకులు గంగయ్య, ప్రకాష్ ,సతీష్, మాధురి పాల్గొన్నారు.

నరసరావుపేటలో భిక్షాటనకు బయలుదేరిన ఉద్యోగులు

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఉద్యోగులు భిక్షాటనతో నిరసన తెలిపారు. వీరికి యుటిఎఫ్, ఎస్‌టియు, సిపిఎం సంఘాలు మద్దతు తెలిపాయి. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎల్‌వి రామిరెడ్డి, ఎపిసిపిఎస్ జిల్లా అధ్యక్షులు పి.పిచ్చయ్య మాట్లాడారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని గత ఎన్నికలకు ముందు హామీనిచ్చినా అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని విమర్శించారు. యుటిఎఫ్ నాయకులు కె.తిరుపతిస్వామి, టి.సత్యనారాయణ, ఎస్‌టియు నాయకులు నాగవేణు, ముజఫర్ రెహ్మాన్, సాల్మన్, మహబూబ్ సుభాని, శ్రీనివాసరావు, అబ్దుల్ అజీజ్, షేక్ కరీముల్లా, శరత్ కుమార్ సంఘీభావం తెలిపారు. ఉద్యోగులు వై.సుబ్బాయమ్మ, కళ్యాణి, కాంచన, డి.నరసింహస్వామి, పి.నరసింహ నాయక్, బి.కోటేశ్వరరావు నాయక్, ఎం.శివనాగ ప్రసాద్, ఎం.పోతురాజు, పి.రామకృష్ణ, పి.సాంబ శివరావు, డి.శ్రీకాంత్, షేక్ బాషా, ఎన్.మంగయ్య, కెవెంకట్, డి.లింగయ్య పాల్గొన్నారు.

మోత మోగించిన అంగన్‌వాడీలు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ టీచర్లకు రూ.11500, ఆయాలకు రూ.7 వేలు ఏమాత్రమూ సరిపోదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు పెంచాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా తెలంగాణ ప్రభుత్వం కంటే రూ.వెయ్యి అదనంగా వేతనం పెంచాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించపోతే ఉద్యమం మరింత ఉధృతం అవుతుందని, అంగన్‌వాడీలకు అన్ని సంఘాలు అండగా ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమానికి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నగర ప్రధాన కార్యదర్శి టి.రాధ అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ, నాయకులు చిన్న వెంకాయమ్మ, సిఐటియు తూర్పు నగర ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ ప్రసంగించారు. నరసరావుపేట సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమార్ మాట్లాడారు. అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు సంబంధించిన బిల్లులన్నీ సకాలంలో చెల్లించక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని

నరసరావుపేట సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

చెప్పారు. సమ్మె నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాల సేవలకు పిల్లలు, గర్భిణులు, బాలింతలు దూరమయ్యారని, ఈ విషయాన్ని ప్రభుత్వం గమనించి సమ్మె నివారణ కోసం అంగన్వాడీల డిమాండ్లను అంగీకరించాలని కోరారు. ఎఐటియుసి నాయకులు కె.రాంబాబు మాట్లాడుతూ మాట తిప్పను.. మడమ తిప్పను అని చెప్పిన వారే ఇప్పుడు హామీలను విస్మరించి మోసం చేశారని అన్నారు. ప్రభుత్వం దిగొచ్చే వరకూ సమ్మె కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, నాయకులు, నిర్మల, మాధవి, కవిత, ఎఐటియుసి రాష్ట్ర సహాయ కార్యదర్శి హెల్డా ఫ్లారిన్స్, నాయకులు శోభారాణి, విజయ కుమారి, విజయలక్ష్మి, యు.రంగయ్య, వి.వెంకట్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆడుదాం ఆంధ్ర ఆరంభం

(మొదటి పేజీ తరువాయి)

స్పందించారు. ఉదారంగా ఆదుకోవాలని అక్కడే ఉన్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని ఆదేశించారు. గుంటూరు 25వ డివిజన్‌కు చెందిన కాశిరెడ్డి కుమారుడు ఎనిమిదేళ్ల బి.నాగత్రినాథ్‌రెడ్డి రెండేళ్లుగా హైపోగ్లైసీమియాతో బాధపడుతున్నందున, స్పీచ్ థెరపి కోసం ఆర్థిక సాయం చేయాలని కోరారు. వైద్యం కోసం చేసిన ఖర్చులు రూ.20 లక్షల ఆర్థిక సాయం, ప్రతినెల చికిత్స కోసం రూ.20 వేల నెలవారీ పెన్షన్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. నెలావారీగా ఖర్చు చేసుకునేందుకు, వైద్యఖర్చులు, స్పీచ్ థెరపీ కోసం ఫిక్సడ్ డిపాజిట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పల్నాడు జిల్లా నర్సరావుపేట మండలం దొండపాడుకు చెందిన బ్రహ్మయ్య తన ఐదేళ్ల కుమారుడు రాజవరపు మోక్షిత్‌కు మోషన్ వెంటిలేషన్ ట్రాక్ చికిత్స కోసం ఖర్చు చేసిన రూ.12 లక్షలు సాయంగా ఇవ్వాలని కోరారు. వైద్యఖర్చుల బిల్లుల ప్రకారం మొత్తాన్ని మంజూరు చేస్తామని సిఎం హామీ ఇచ్చారు. చిలకలూరిపేటకు చెందిన 39 ఏళ్ల సయ్యద్ రహమతుల్లా తీవ్రమైన అక్యూట్ ప్యాంక్రియాటైటీస్ వ్యాధి చికిత్స కోసం చేసిన వైద్య ఖర్చులు రూ.45 లక్షల అయితనట్లు తెలపగా బిల్లులను చెల్లిస్తామని సిఎం హామీ ఇచ్చారు.

బడ్జెట్ ఆమోదం కోసం..

(మొదటి పేజీ తరువాయి)

వేసుకోవాలని సూచించారు. ఈ అంశంపై క్షేత్రస్థాయి పరిస్థితులపై చర్చకు అవకాశం ఉంది. మిర్చి సాగుకు ఒక తడికి నీరు ఇవ్వాలని కోరనున్నారు. వైద్య ఆరోగ్యశాఖకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నా క్షేత్రస్థాయిలో వైద్యులు, సిబ్బంది సరిగా పనిచేయకపోవడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులపై జెడ్‌పిటిసిలు మాట్లాడే అవకాశం ఉంది. పాఠశాలల నిర్వహణకు సంబంధించి నాడు నేడులో అసంపూర్తిగా ఉన్న పనులు, సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు అధికంగా ఉన్న జెడ్‌పి పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో సాంఘీకసంక్షేమ శాఖకు సంబం ధించి వసతిగృహాల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడింది. మెనూ ప్రకారం ఆహారం అందించకపోవడం, అసౌకర్యాల నడుమ ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో రహదారులు అధ్వానంగా మారాయి. నిధుల కొరత వల్ల కనీసం ప్యాచ్ వర్కులు కూడా జరగడం లేదు. మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులున్నా రహదారులను అభివృద్ధి చేసుకోలేకపోతున్నారు. పల్నాడులో నాలుగు కోట్ల వరకు ఎమ్‌డిఎఫ్ నిధులున్నాయి. గుంటూరు జిల్లాలో రూ. 50 లక్షల వరకు ఉన్నాయి. ఎంపి ల్యాడ్స్, సచివాలయాలకు రూ.20 లక్షల నిధులతో అయినా కొన్ని రహదారులను మెరుగుపర్చుకునే అవకాశం ఉన్నా చాలావరకు ఉమ్మడి జిల్లా స్థాయిలో సమన్వయం లోపం వల్ల రహదారులు నిర్మాణానికి నోచడం లేదనే విమర్శ అధికార పార్టీ నుంచి వినిపిస్తోంది.

సమస్యలపై ఆశాల నిరసన, వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కనీస వేతనం ఇవ్వాలని, సెలవులు, గ్రూప్ ఇన్సూరెన్స్, సంక్షేమ పథకాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, వయోపరిమిత 62 ఏళ్లకు పెంచాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ మేరకు నరసరావుపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపి వితని పత్రమిచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి మాట్లాడుతూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వారి డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించాలని కోరారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, పనివారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. 18 ఏళ్లుగా పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌ను ఆశలుగా మార్పు చేయాలని రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు, జీతంలో సంగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు ధనలక్ష్మి, కనకరత్నం, కృష్ణకుమారి, అనూష, రాజ్యలక్ష్మి, రజిని, రమణ, పి.అనూష పాల్గొన్నారు.

రైతులకు జలకళ పంపుసెట్లు

ప్రజాశక్తి - నూజెండ్ల : మండలంలోని ఉప్పలపాడులో వైయస్సార్ జలకళ ద్వారా లబ్ధి పొందిన 85 మంది రైతులకు పంపుసెట్లు, మోటార్లను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మంగళవారం అందజేశారు. సుమారు రూ.3.70 లక్షల విలువైన పంపుసెట్లు, మోటర్లు పంపిణీ చేయటం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు.

పల్నాడులో 50 శాతం తగ్గిన నేరాలు, ప్రమాదాలు

20ఎకరాల విస్తీర్ణంలో నూతన భవనం నిర్మాణానికి ప్రణాళిక - పల్నాడు పోలీసుల పనితీరు భేష్ : డిజిపి కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాతో పాటు రాష్ట్రంలో కూడా గత ఏడాదితో పోలిస్తే నేరాలు, దొంగతనాలు, హత్యలు రోడ్డు ప్రమాదాలు, 50 శాతం తగ్గిపోయాయని ఏపీ డీజీపీ కసిరెడ్డి వెంకట రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మంగళ వారం పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని డిజిపి కసిరెడ్డి వెంకట రాజేంద్రరెడ్డి, గుంటూరు రేంజ్ ఐజి పాలరాజు లు సందర్శించారు. ఎస్పీ కార్యాలయంలోని పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా విభాగాలను సందర్శిం చిన డిజిపి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పల్నాడు జిల్లా ఏర్పాటు అయ్యాక మొదటిసారిగా పల్నాడు జిల్లాకు వచ్చిన డిజిపికి ఎస్.పి వై. రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఘన స్వాగతం పలికారు. డిఎస్పీలు మరియు పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిజిపి మాట్లాడారు. పౌరుషాల గడ్డగా పేరుగాంచిన పల్నాడులో గతంతో పోలిస్తే దాడులు, హత్యలు , దొంగతనాలు, ఆస్తుల వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, ఫోక్స్ కేసులు 50 శాతం తగ్గాయని ఇంకా ఆయా దొంగతనాలు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశామన్నారు. రానున్న రోజుల్లో పల్నాడు జిల్లాలో 20 ఎకరాలు విస్తీర్ణంలో నూతన పోలీసు భవన సముదాయాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 11 సమస్యాత్మక మండలాల్లోని 32 గ్రామాలలో ఇప్పటికే నేర చరిత్ర ఉన్న వారిని బైండవర్ చేయడంతోపాటు ఆయా గ్రామాలలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. పల్నాడులో ప్రశాంత వాతావరణ నెలకొల్పేందుకు పోలీసు శాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ స్టేషన్లకు తమ సమస్యలు పరిష్కారం కోసం వచ్చే కక్షిదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని పోలీసు వ్యవస్థ పట్ల కక్షి దారులకు విశ్వాసం ఏర్పడేలా వ్యవహరించాలన్నారు. పల్నాడు పోలీసులు పనితీరు వలన జిల్లాలో 50 శాతం ఆయా నేరాల సంఖ్య తగ్గిందని రాష్ట్రవ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి ఉందని రానున్న రోజుల్లో నేరాలు, కిడ్నాప్ లు,రోడ్డు ప్రమాదాల సంఖ్య ఇంకా తగ్గించేందుకు పోలీసు వ్యవస్థను పటిష్టం చేస్తామని పేర్కొన్నారు. టిడిపి నేతలపై కక్షపూరితంగా కేసులు పెట్టి వేధిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలో వాస్తవం లేదని పోలీసు వ్యవస్థను సక్రమంగా నిర్వహించకపోతే తాము కోర్టుకు సమాధానం ఇచ్చుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఈ సమావేశం లో పల్నాడు అదనపు ఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న డిజిపి, ఇతర అధికారులు

సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

మరోస్వాతంత్య్ర పోరాటానికి సిద్ధం కావాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు, విలేకర్లు : శ్రమ ఉన్నంత కాలం కమ్యూనిస్టు పార్టీ ఉంటుందని, అధికారం ఉన్నా లేకున్నా సమ సమాజ నిర్మాణం కోసం కమ్యూనిస్టు పార్టీ కృషి చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మంగళవారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో తాడేపల్లి, తుళ్లూరు, పెదకూరపాడు, మాచర్ల తదితర మండల కేంద్రాల్లో సిపిఐ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. గుంటూరులోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సిపిఐ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ పతాకాన్ని జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ఆవిష్కరించారు. లెనిన్ విగ్రహానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పూలమాల వేశారు. అనంతరం పార్టీ నగర కార్యదర్శి మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో సిపిఐకి ఘన చరిత్ర ఉందని, ఒక రాజకీయ పార్టీగా వందేళ్లు పూర్తి చేసుకోవటం సామన్య విషయం కాదన్నారు.స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ సాయుధ పోరాటం వంటి వీరోచిత పోరాలను రక్తతర్పణంతో నడిపించిన పార్టీ అని కొనియాడారు. కేంద్రంలో మతోన్మాద, అభివృద్ధి నిరోధక పార్టీ అధికారంలో ఉందన్నారు. రాష్ట్రంలో సైతం తిక్కరెడ్డి పాలన సాగుతోందని విమర్శించారు. రూ.11 లక్షల కోట్లు అప్పులు చేసి, రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్న ప్రస్తుత ప్రభుత్వాలపై మరో స్వాతంత్ర్య పోరాటానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. సభలో ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, ఎఐటియుసి రాష్ట్ర గౌర వాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి, ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజ్ తదితరులు ప్రసంగించారు. దేవునిదయ,ఎఐటియుసి కార్యదర్శి నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPLE SENIOR CIVIL JUDGE COURT, NARASARAOPET
O.S.No 45/2019, I.A. No 193/21

Between:
Addamkai Govindamma and others ...Petitioner / Plaintiff
and
Valisetti. Jagannamdham (died) and others .... Defendant / Respondents

(R3) పసుపులేటి వెంకట మహాలక్ష్మమ్మ W/O జోజయ్య D/O వలిశెట్టి. జగన్నాధం. వయస్సు 40 సం॥, గృహిణి పిల్లుట్ల గ్రామం, మాచవరం మండలం పల్నాడుజిల్లా.

పై నెంబర్ O.S.నెంబర్ 45/2019 అద్దంకి గోవిందమ్మ అను నేను దావా దాఖలు చేసుకొని యున్నాను. సదరు దావా నందు DF1 వలిశెట్టి జగన్నాధం చనిపోయిన కారణంగా శ్రీయుత కోర్టు నందు I.A.No 193/21 గా L.R పిటిషన్ దాఖలు చేసికొనియున్నాను. ఈ L.R పిటీషన్ నందు శ్రీయుత కోర్టు వారి ద్వారా R3 అయిన పసుపులేటి వెంకట మహాలక్ష్మమ్మకు పలుమార్లు శ్రీయుత కోర్టు వారి ద్వారా సమన్లు జారీ చేసినచో వారు తీసుకొని యెడల శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా మీకు తెలియపరచడమైనది ఏమనగా పై నెంబర్ O.S 45/2019 మరియు I.A. No 193/21 నందు 22-01-2024 తేదీన ఉదయం 10.30 ని॥ కు పై కోర్టు వారి ఎదుట హాజరై మీరు కానీ, మీ తరపు వకీలు ద్వారా మీకు గల ఆక్షేపణలు కోర్టు వారి ఎదుట తెలుపగలరు. లేని యెడల మీకు పరోక్షంగా తీర్మానించ బడునని శ్రీయుత కోర్టువారి ద్వారా పేపరు ప్రకటన వేయడమయినది.

కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం
వాయిదా తేదీ ది. 22-01-2024

ఇట్లు,
ఎం. రవికాంత్,
అడ్వకేట్, నరసరావుపేట

మహారాజశ్రీ నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 186/2017

ఖంజుల సూర్యకుమారి ..... వాది
ఎదిరి
శ్రీమతి తియ్యగూర కోటేశ్వరమ్మ ఇంకనూ ముగ్గురు .... ప్రతివాదులు

To,
D4: తియ్యగూర సామ్రాజ్యం భర్త అంజిరెడ్డి పోలిరెడ్డిపాలెం, చిలకలూరిపేట పట్టణం, పోస్ట్ మరియు మండలం
చిలుకలూరిపేట జె.సి.జె.సి, పల్నాడు జిల్లా.

పై నెంబర్ దావాలో నిన్ను పార్టీగా చేర్చి సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం ఎన్ని పర్యాయములు నోటీసు, పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారని మీకు నోటీసులు పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయుటకు పర్మిషన్ ఇచ్చియున్నారు. సదరు పర్మిషన్ ప్రకారం సదరు పై కోర్టువారు ఎదుట 12-01-2024న ఉదయం 10.30 ని॥ మీరు స్వయంగా కానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షన తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియచేయడ మైనది.

ఇట్లు,
డి.వి.రమణారెడ్డి,
వాది తరపు న్యాయవాది, విజయవాడ.

చేనేత ప్రముఖులను కలిసిన లోకేష్

ప్రజాశక్తి -మంగళగిరి : మంగళగిరిలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు చింత క్రింది కనకయ్య నివాసంలో పద్మశాలి ప్రముఖులతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమావేశం అయ్యారు. ప్రముఖ పవర్ లిఫ్టర్ షేక్ సాదియా అల్మాస్‌ను ఈ సందర్భంగా ఆమె నివాసంలో అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, దామర్ల రాజు, గుత్తికొండ ధనుంజయ రావు, వింజమూరి ఆశా బాల, తమ్మిశెట్టి జానకి దేవి, కాండ్రు శ్రీనివాసరావు, పోతినేని శ్రీనివాసరావు, గోవాడ దుర్గారావు, కారంపూడి అంకమ్మరావు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడు మృతి

భార్యాభర్తల మధ్య గొడవలో బంధువులు జోక్యం - కర్రలు, కత్తులతో దాడి

ప్రజాశక్తి-తెనాలి

భార్యాభర్తల మధ్య ఏర్పడిన స్వల్ప వివాదంలో భార్య తరపు బంధువులు జోక్యం చేసుకుని దాడికి పాల్పడటంతో భర్త తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఘటనపై పోలీసులు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. రూరల్ గ్రామం కఠెవరంకు చెందిన గారా వాసు(25), వెన్నెల భార్యాభర్తలు. వాసు పెయింటింగ్ పనులకు వెళుతుంటాడు. తరచుగా మద్యం సేవించి భార్యను వేదిస్తున్న నేపథ్యంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని వెన్నెలను పుట్టింటికి పంపాల్సిందిగా వెన్నెల తండ్రి వాసును కోరాడు. దానికి వాసు నిరాకరటిచటంతో వారి మధ్య వాదోపవాదాలు జరిగాయి. తిరిగి వెళ్ళిన మామ తన కొడుకులకు విషయం చెప్పటంతో వారు మూకుమ్మడిగా సోమవారం అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో వచ్చి వాసుపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. దాడిని అడ్డుకున్న వాసు మేనమామను కూడా తీవ్రంగా దాయపరిచారు. నిందితులు మద్యం, గంజాయి మత్తులో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన వాసును కుటుంబ సభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అప్పటికే వాసు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. క్లూస్‌టీమ్‌ను రప్పించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం అనంతరం మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆసుపత్రి వద్ద విచారణలో సిఐ, ఎస్ఐ

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి - నకరికల్లు

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఆవుల బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం రాజుపాలెం మండలం ఇనిమేట్ల గ్రామానికి చెందిన లింగాల సురేష్ (35) విద్యుత్ పనులు చేస్తుంటాడు. చీమలమర్రి గ్రామంలో యర్రం నేని వెంకటేశ్వర్లు ఇంటిలో విద్యుత్ పనులు చేయడానికి పరంజా కట్టే సమయంలో సురేష్ చేతిలో ఉన్న తడి కర్ర ప్రమాదవశాత్తు ఇంటి పైనుండి వెళుతున్న 11 కె.వి విద్యుత్ వైర్లకు తగలడంతో విద్యుత్ షాక్‌తో మరణించాడు. మృతుని భార్య రమాదేవి అంగన్వాడి ఆయాగా పనిచేస్తుంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

స్విమ్మింగ్ పోటీల్లో శివనాగేశ్వరరావుకు బంగారు పతకాలు

ప్రజాశక్తి -మంగళగిరి

కర్నూలు డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్ లో ఆంధ్రప్రదేశ్ మాస్టర్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24 న జరిగిన ఆరవ స్టేట్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్-2023 రాష్ట్రస్థాయి పోటీలలో మంగళగిరికి చెందిన ప్రముఖ చేనేత వస్త్ర వ్యాపారవేత్త కాండ్రు శివ నాగేంద్రరావు పాల్గొని రెండు గోల్డ్ మెడల్స్, సిల్వర్, బ్రోంజ్ మెడల్స్ సాధించారు. మాస్టర్ స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్రస్థాయిలో ఐదు రకాల స్విమ్మింగ్ పోటీలు నిర్వహించింది. శివ నాగేంద్రరావు నాలుగు రకాల స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని నాలుగు మెడల్స్ సాధించారు. కాండ్రు శివ నాగేంద్రరావు 60- 64 వయస్సు గ్రూపు (మెన్స్)లో ఐఎం 200 మీటర్ల స్విమ్మింగ్ పోటీలలో గోల్డ్ మెడల్, 50 మీటర్ల బటర్ఫ్లై స్విమ్మింగ్ పోటీలలో గోల్డ్ మెడల్, 100 మీటర్ల బటర్ఫ్లై సిమ్మింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్, 100 మీటర్ల ఫ్రీఫైల్ స్విమ్మింగ్ పోటీలలో బ్రోంజ్ మెడల్ సాధించారు. అనంతరం జరిగిన బహుమతుల ప్రధానోత్సవం సభలో మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ చేతుల మీదగా శివ నాగేంద్రరావు 4 మెడల్స్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా మెడల్స్ సాధించిన శివ నాగేంద్రరావు పలువురు నగర ప్రముఖులు, వస్త్ర వ్యాపారవేత్తలు మంగళవారం అభినందించారు.

ఎస్ఆర్ఎం వర్సిటీ ఐఆర్ హెచ్ఎస్ డైరెక్టర్‌గా అదితి జైన్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆంధ్రప్రదేశ్ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లోని ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ హయ్యర్ స్టడీస్ (ఐఆర్‌హెచ్ఎస్) విభాగం నూతన డైరెక్టర్‌గా అదితి జైన్ నియమితులయ్యారు. ఢిల్లీకి చెందిన అదితి జైన్ ప్రాజెక్టు మేనేజ్మెంట్ స్టడీస్ లో విధ్యనభ్యసించి విద్య, నైపుణ్యాభివృద్ధితో పాటు ఎడ్యుకేషన్ టెక్నాలజీ రంగాల్లో 18 ఏళ్ల పాటు విశేషమైన అనుభవాన్ని సొంతం చేసుకున్నారు. అంతర్జాతీయంగా పేరున్న సుమారు 500 కంపెనీలతో మైత్రీ సంబంధాలు కలిగిన అదితి జైన్ శ్యాంసంగ్, మైక్రోసైట్, వోడాఫోన్ ఫౌండేషన్లలో వివిధ హోదాల్లో పని చేశారు. టైమ్స్ గ్రూప్ నకు చెందిన బెన్నెట్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ హయ్యర్ స్టడీస్ లో విశేషమైన సేవలందించారు. ఈ సందర్భంగా ఆమెకు బోస్టన్ యూనివర్సిటీ నుంచి బెస్ట్ ఎడిక్ స్టార్ట్ ఆవార్డు కూడా లభించింది. అంతర్జాతీయంగా ఉన్న వివిధ యూనివర్సిటీలను సమన్వయం చేసుకునే సామర్థ్యం ఉన్న ఆదితి జైన్ ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో డైరెక్టర్గా విధులను చేపట్టడం ఆనందదాయకమని వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా అభిప్రాయపడ్డారు.

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రోజ

అన్నీ గెలవాలనే అసెంబ్లీ సీట్లు ఎంపిక : మంత్రి రోజా

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలో 175 సీట్లను గెలవాలని ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీ సీట్ల ఎంపిక చేస్తున్నారని రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా అన్నారు. మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానము సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నగరి అసెంబ్లీ సీటు తనకు ఇచ్చిన ఇవ్వకపోయినా పరవాలేదని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కోసం త్యాగం చేస్తానని అన్నారు. జగన్మోహన్ రెడ్డి కాదని ఎవరు బయటకు వెళ్లిన వారికి గతి లేకుండా పోతుందని అన్నారు. వైయస్ షర్మిల జగన్మోహన్ రెడ్డికి ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేసిందని అన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కూడా పార్టీలోనే కొనసాగుతారని ఆమె తెలిపారు. తనకు శత్రువులు ఎక్కువేనని తనను దూషించిన వారిని శ్రీ లక్ష్మీనరసింహస్వామి చీల్చి చెండాడుతారని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి ఘన స్వాగతం పలికారు.

సమ్మెలోకి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు

పిడుగురాళ్ల

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు మంగళవారం నుండి సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా సత్తెనపల్లిలో కార్మికులు విధులు బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. శిబిరాన్ని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయనాయక్ ప్రారంభించి మాట్లాడారు. ప్రజారోగ్యం కోసం పాటుపడుతున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. క్లాప్ ఆటోల డ్రైవర్లకు కనీస వేతనం రూ.18500 ఇవ్వాలని, పర్మినెంట్ సిబ్బందికి సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి వి.చంద్రకళ, సత్తెనపల్లి అధ్యక్షులు సిహెచ్.పెదవెంకయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి హరిపోతురాజు, కార్మికులు జె.నాగమణి, జె.రమేష్, వి.కోటేశ్వరమ్మ, స్టీఫెన్, జి.శ్రీను, కె.సుబ్బులు, సునీత, డి.కోటేశ్వరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలో కార్మికులు సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సిఐటియు నాయకులు బండ్ల మహేష్ ప్రారంభించి మాట్లాడారు. కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటీ, సగం జీతం పెన్షన్‌గా ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై ఇప్పటికే పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోని నేపథ్యంలో కార్మికులు సమ్మెకు పూనుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె రమణ, అనసూయ, బి.చిన్నమ్మాయి, లక్ష్మీదేవి, డి.రమణ, ఇస్సాకు, ఆంజమ్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్థానిక ఐలాండ్ సెంటర్లోని ఏడుకొట్ల సెంటర్ వద్ద సమ్మె శిబిరాన్ని సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. కార్మికులను పర్మినెంట్ చేస్తామంటూ ప్రతిపక్షంలో ఉండగా హామీనిచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు విస్మరించారని విమర్శించారు. కనీస వేతనం రూ.26 ఇవ్వాలని, ప్రమాదకరంగా మారిన ఆప్కాస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగొచ్చే వరకూ సమ్మె కొనసాగుతుందని, ప్రజలకు పారిశుధ్య సమస్యలు తలెత్తితే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు కె.సీతారామయ్య, ఎం.ప్రతాప్, ఏరమ్మ, సుజాత, పి.సురేంద్ర, ఆర్.శ్రీను, కె.వెంకటమ్మ, అనంతలక్ష్మి, డి.లక్ష్మి, కొండలు, మార్తమ్మ పాల్గొన్నారు.

సత్తెనపల్లి శిబిరంలో మాట్లాడుతున్న ఆంజనేయ నాయక్

మాచర్ల

ముఖ్యమంత్రికి వినిపించాలని ఖాళీ కంచాలతో మోత..

సత్తెనపల్లి

పిడుగురాళ్ల

15వ రోజుకు అంగన్వాడీల సమ్మె

తమ సమస్యల పరిష్కారం కోసం రెండువారాలకు పైగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు మంగళవారమూ నిరసనలు కొనసాగించారు. రోజుల తరబడి తాము ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని, తమ ఆవేదన సిఎంకు వినిపించుకోవాలని కోరుతూ అంగన్వాడీలు కంచాలపై గంటెలతో కొట్టి వినూత్నంగా నిరసన తెలిపారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక తాలూకా సెంటర్లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో అంగన్వాడీలు ఖాళీ కంచాలను గరిటెలు, గ్లాసులతో మోగించి నిరసన తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లీశ్వరి మాట్లాడుతూ ఎన్నికలప్పుడు గుర్తొచ్చిన అక్క చెల్లెమ్మలు సమస్యలు వచ్చినప్పుడు కనపడటం లేదా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను గుర్తు చేసి వాటిపై మాట తప్పారని, మడమ తిప్పారని విమర్శించారు. ప్రభుత్వం దిగొచ్చి తమ డిమాండ్లను అంగీకరించే వరకూ సమ్మె కొనసాగుతుందని ఉద్ఘాటించారు. సిఐటియు మండల కార్యదర్శి పి.మహేష్ డివైఎఫ్ఐ నాయకులు జె.రాజ్‌కుమార్, అంగన్వాడీ యూనియన్ నాయకులు జి.సుజాత, ఎం.అహల్య, చాముండేశ్వరి, ధనలక్ష్మి, అంజలి, భారీగా అంగన్వాడీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక సురేష్ మహల్ రోడ్డులోని సమ్మె శిబిరంలో ఖాళీ కంచాలపై గరిటెలతో కొడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమానికి యూనియన్ నాయకులు ప్రసన్నకుమారి అధ్యక్షత వహించగా మద్దతుగా సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, ఎఐటియుసి నాయకులు ఎ.మారుతి వరప్రసాద్ మాట్లాడారు. కె.రాంబాబు, యు.రాము, బి.కోటయ్య, అంగన్వాడీ నాయకులు ఎస్‌కె.మున్ని, విజయకుమారి, నాగజ్యోతి, డి.బీబీలు, యేసు మాణిక్యం, శారద, శ్రీదేవి, జి.పద్మ, జె.పద్మావతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

స్థానిక పిఆర్ విజ్ఞాన కేంద్రం నుండి జాతీయ రహదారి వరకూ అంగన్వాడీలు ఖాళీ కంచాలపై గరిటెలతో కొడుతూ ప్రదర్శన చేశ్శారు. వీరికి మద్దతుగా విజ్ఞాన కేంద్రం బాధ్యులు ఎన్.కాళిదాసు మాట్లాడారు. అంగన్వాడీలు ఎం.అరుణకుమారి,, ఎం.కోకిల, మారుతి, సిఐటియు నాయకులు, టి.కోటేశ్వరరావు, జె.శంకరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక పండరిపురంలోని సిఐటియు కార్యాలయం నుండి ఎన్‌ఆర్‌టి సెంటర్ వరకూ కంచాలను మోగిస్తూ అంగన్వాడీలు ప్రదర్శన చేశారు. సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు, అంగన్వాడీల యూనియన్ సెక్టార్ అధ్యక్షులు జి.సావిత్రి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ, గిరిజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్, సిఐటియు నాదెండ్ల మండలం నాయకులు పి.శ్రీనివాసరావు, మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి - క్రోసూరు

స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద సమ్మె శిబిరాన్ని సిపిఐ మండల కార్యదర్శి పి.నాగేశ్వరావు, రైతు సంఘం కార్యదర్శి కె.పెద్దబ్బాయి సందర్శించి సంఘీభావం తెలిపారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో కంచాలు మోగించి నిరసన తెలిపారు. తొలుత స్థానిక జెడ్‌పి పాఠశాలకు మ్మెల్యే ఎన్.శంకరరావు వస్తున్నారని తెలిసి అక్కడ కొద్దిసేపు నిరసన తెలిపారు. ఎమ్మెల్యే రాగానే తమ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సమ్మె శిబిరంలో కంచాలను గంటెలతో మోగిస్తూ నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు టి.శ్రీనివాసరావు మాట్లాడారు. యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు షేక్ హజర, నాయకులు శివరంజని, బుజ్జి, కవిత, శ్రీలక్ష్మి, నాగమణి, అరుణ, రామలక్ష్మి, గురవమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక అంబేద్కర్ సెంటర్‌లోని సమ్మె శిబిరాన్ని యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కెఎస్ రాజు, కె.కేశవరెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్వాడీలతోపాటు వారుకూడా ఖాళీ కంచాలను గంటెలతో మోగించి నిరసన తెలిపారు. సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలని, ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. యూనియన్ నాయకులు ఉషారాణి, ఇందిరా, కె.పద్మావతి, కోటేశ్వరి, సుందరలీల, శారద, దుర్గా శివలక్ష్మీ, రుక్మిణి, జయలక్ష్మీ, శివపార్వతీ, లీలావతి, వెంకటరమణ, సైదమ్మ, చిలకమ్మ, మల్లీశ్వరి, యుటిఎఫ్ నాయకులు జెవికెఎస్ ప్రసాద్, ఎ.నాసర్‌రెడ్డి, నజీర్, యువి రావు, బాలాజీనాయక్, పి.రామారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం నుండి అంబేద్కర్ విగ్రహం వరకూ కంచాలను మోగిస్తూ ప్రదర్శన చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడారు.

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద సమ్మె శిబిరంలో కంచాలు మోగించారు. సిఐటియు మండల కార్యదర్శి ఎం.దేవసహాయం మాట్లాడారు. ఆశా కార్యకర్తలు సంఘీభావం తెలిపారు.

పెదకూరపాడులో ఎమ్మెల్యేకు వినతి

వినుకొండ

చిలకలూరిపేట

ఈపూరు

అమరావతి

యడ్లపాడు

క్రోసూరు

మాచర్ల

ప్రజాశక్తి
గుంటూరు 5
బుధవారం 27 డిసెంబర్ 2023

కంచాలు గెరిటలతో మోత మోగించిన అంగన్వాడీలు

15వ రోజున ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి-తాడేపల్లి :అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న పోరాటాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని సమస్యలను పరిష్కరించాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం సమీపంలో అంగన్‌వాడీలు రెట్టించిన ఉత్సాహంతో సమ్మె కొనసాగిస్తున్నారు. తమ డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగిస్తామని ఈ సందర్భంగా ప్రతిన బూనారు. ఈ కార్యక్రమంలో వైదేవి, సుజాత, రమణ, ఫాతిమ, నాగసుభాషిణి, వెంకటలక్ష్మి, సబిత పెద్దఎత్తున అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి :అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని మంగళగిరి మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు ఎం పకీరయ్య అన్నారు. మంగళవారం అంబేద్కర్ సెంటర్లో జరుగుతున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడి వారి న్యాయమైన కోరికలను ప్రభుత్వం పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానమును సందర్శించారు. ఆ విషయం తెలిసిన అంగన్వాడీలు నిరవధిక సమ్మె శిబిరం నుండి దేవస్థానానికి చేరుకున్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కారానికి గత 15 రోజులకు అంగన్వాడీ లు నిరవధిక సమ్మె చేస్తున్నారు. దీనిపై మంత్రి రోజాను కలవడానికి వెళ్లగా సెక్యూరిటీ సిబ్బంది రోజున కలవకుండా అడ్డుకోవడం జరిగింది. దీంతో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు వినడానికి కూడా మంత్రి రోజా నోచుకోకపోవడాన్ని నిరసించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు హేమలత, రుక్మిణి, వినీల, మేరీ రోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :గత 14 రోజులుగా నిర్వహిస్తున్న అంగన్వాడీలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె మంగళవారంతో 15రోజులకు చేరుకుంది. స్థానిక విఎస్ఆర్ అండ్ ఎన్విఆర్ కళాశాల ఎదురుగా నిర్వహిస్తున్న అంగన్వాడీల సమ్మెకు సిపిఐ, సిపిఎం పార్టీల నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి తమ పూర్తి మద్దతు తెలుపుతున్నారు. వినూత్నంగా పళ్లెం, గరిటలతో శబ్దం చేస్తూ టీచర్లు, ఆయాలు రిలే దీక్షను కొనసాగించారు. ప్రభుత్వం దిగి రాకపోతే సమ్మెను ఉదతం చేస్తామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్ వి నరసింహారావు అన్నారు సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు కలెక్టర్ స్థాయి అధికారులను నియమించి అంగన్వాడీలకు న్యాయం జరిగేలా చూడాలని పేర్కొన్నారు. పలు ప్రజా సంఘాల నాయకులు అలాగే రాజకీయ నేతలు అంగన్వాడీలకు మద్దతు తెలుపుతున్నారని అంగన్వాడీ నాయకులు ఎ వి ఎన్ కుమారి, పావని అన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు : మండల కేంద్రమైన మేడికొండూరు ప్రధాన సెంటర్లో అంగన్వాడి వర్కర్స్ సమ్మె కొనసాగుతుంది. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా అంగన్వాడీ కార్యకర్తలు పళ్ళెలు మోగించి నిరసన తెలిపారు. ఈ సమ్మెకు మందపాడు ఆరోగ్య సబ్ సెంటర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, మేడికొండూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం నుండి గౌస్య, టాన్య ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు వారి డిమాండ్స్ పై చేసే సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు ఎస్ఎం బాషా కౌలు రైతు సంఘం నాయకులు బోట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్ : మండల కేంద్రమైన పెదకాకానిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభంచడానికి రాజ్యసభ సభ్యులు ఆళ్ల యోధ్య రామిరెడ్డి, పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్యలకు మంగళవారం పెదకాకాని విచ్చేశారు. సెంటర్లో సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్నిఅందజేటకు వెళుతున్న అంగన్వాడీలు, హెల్పర్లను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి దష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారానికి కషి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు: మండల కేంద్రంలో అంగన్వాడి సమ్మె కు ఆశా వర్కర్లు మద్దతు తెలిపి ర్యాలీ నిర్వహించారు. తాసిల్దారు కు అంగన్వాడీ ఆశాలు అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు నగరాజకుమారి, కుసుమ, సుభాషిని, కరిమూన్, వనజా వీరికి మద్దతుగా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పి ధనలక్ష్మి, జ్యోతి,నజీరా,సాయిరాజ్ పాల్గొన్నారు

ప్రజాశక్తి - తుళ్లూరు :తమ సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటాన్ని నిరసిస్తూ అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు మంగళవారం కంచాలు మోగిస్తూ నిరసన తెలిపారు సమ్మెకు సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు మద్దతు తెలిపారు.అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) మండల అధ్యక్ష,కార్యదర్శి స్వర్ణలత,కరిమూన్ నాయకత్వం వహించారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ :పెదనందిపాడు లో అంగన్వాడీలు ఖాళీ కడుపులో కంచాల మోగించి తమ నిరసనలు వ్యక్తం చేశారు కార్యక్రమంలో మండల సంఘ అధ్యక్షురాలు శివపార్వతి కార్యదర్శి శ్రీదేవి పలు గ్రామాల నుంచి విచ్చేసిన అంగన్వాడీలు పాల్గొన్నారు

ప్రజాశక్తి - ఫిరంగిపురం :ఫిరంగిపురంలో తాసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరంలో వారు ప్లేట్లు మోగిస్తూ నిరసన తెలియజేస్తూ సమ్మెను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడి మండల కార్యదర్శి పి రజిని, పద్మ, మల్లేశ్వరి, షేక్ మనీ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ : అంగన్వాడీతలకు సిఐటియు జిల్లా నాయకులు కందుల శ్రీనివాసరావు మద్దతు తెలిపి ప్రసంగించారు.

ప్రజాశక్తి - చేబ్రోలు: అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 15వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని సిఐటియు మండల కార్యదర్శి హనుమంతరావు ప్రారంభించారు. శిబిరంలో కంచాలు మోగిస్తూ తమ నిరసన తెలియజేశారు.

ప్రజాశక్తి - కొల్లిపర :అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వము పూర్తిగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ భావనారాయణ అన్నారు మంగళవారం మండల కేంద్రమైన కొల్లిపరలోని అంగన్వాడీల దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర రావు అంగన్వాడీల మండల అధ్యక్షురాలు నిర్మల జ్యోతి వల్లభాపురం ఇమాని మాధవి లత సీతమ్మ శివ పార్వతి ధనలక్ష్మి నాగ పద్మ లక్ష్మీ కుమారి పద్మ పుష్పలత షేక్ సూర్యా బేగం శ్రీదేవి అంగన్వాడీలు ఆయాలు పాల్గొన్నారు ఈ సందర్భంగా అంగన్వాడీలు అన్నం ప్లేట్లను మోగిస్తూ తమ నిరసన తెలిపారు.

ప్రజాశక్తి - తాడికొండ :అంగన్వాడీలకు మద్దతుగా ఆశ వర్కర్లు మద్దతు తెలిపారు. అనంతరం శిబిరం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తాసిల్దార్ ఫణింద్రబాబుకి వినతిపత్రం అందించారు.

ప్రజాశక్తి దుగ్గిరాల : దుగ్గిరాలలో ఖాళీ కంచాలతో ప్రదర్శన నిర్వహించారు .కంచాను మ్రోగిస్తూ తమ నిరసనను తెలిపారు కార్యక్రమంలో అంగన్వాడీలు ఎన్ మీనా కుమారి శ్రీలత సరస్వతి విజయలక్ష్మి ఆసియా రత్నకుమారి సుహాసిని రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర దీక్షా శిబిరంలో పాల్గొన్న ఎన్ భావన్నారాయణ

మంగళగిరి శిబిరంలో మాట్లాడుతున్న ఎం పకీరయ్య

పెదకాకానిలో ఎమ్మెల్యేకి, ఎంపికి అంగన్వాడీల వినతి

చేబ్రోలులో

దుగ్గిరాలలో

మేడికొండూరులో

పెదనందిపాడులో

కాకుమానులో

ఫిరంగిపురంలో

ప్రత్తిపాడులో

తాడికొండలో

తుళ్లూరులో

తెనాలిలో

తాడేపల్లిలో

సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

రైతులకు నష్టపరిహారం వెంటనే ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్

మిచౌంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిని నష్టపోయిన పంటలకు నష్ట పరిహారం వెంటనే అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన మందిరంలో జిల్లా రైతు సంఘ నాయకుడు కొత్త వెంకట శివరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సిపిఎం సమావేశంలో వారు మాట్లాడారు. మిర్చి పంటకు హెక్టారుకు రూ.17,000, పొగాకు పంటకు హెక్టారుకు రూ. 10,000 మాత్రమే ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందని, కనీసం ఈ పంటలకు హెక్టారుకు రూ.25,000 నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. శనగ పంట వేసిన రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయారని, ప్రభుత్వం సబ్సిడీ మీద ఇస్తున్న శనగ విత్తనాలు ఈ క్రాప్ బుకింగ్ అయినా రైతులకు మాత్రమే ఇస్తున్నారని, అదేవిధంగా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు భూ యజమాని వేలిముద్ర వేస్తేనే విత్తనాలు ఇస్తామని నిబంధన పెట్టారని తెలిపారు. ఈ క్రాప్ బుకింగ్‌తో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారులైన రైతులు, కౌలు రైతులకు ఉచితంగా శనగ విత్తనాలు అందజేయాలని కోరారు. అదేవిధంగా ఈ ప్రాంత ప్రజల, రైతుల సుదీర్ఘ డిమాండ్ అయిన గుంటూరు ఛానల్ ను పర్చూరు వరకు పొడిగింపు పనులకు అవసరమైన భూసేకరణకు వెంటనే నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు నాయకులుముద్దన వెంకటేశ్వర్లు, చుక్కా యానాదులు, షేక్ సలీం, మద్దూరి రమణ, డి భువనేశ్వరి, మర్రి లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర :రైతులు కౌలు రైతులు ఐక్యంగా ఉద్యమించటం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి అన్నారు. మంగళవారం కొల్లిపర మండలంలోని అన్నవరం లంక, అన్నవరం గౌడ పాలెం లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాల క్రితం ప్రవేశపెట్టిన నిబంధనల ప్రకారం తుపాను కారణంగా నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ 6800 ఇవ్వటం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మొక్కంటి కోటేశ్వరరావు. నరసింహారావు వెంకయ్య. ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రతో యువత భవిష్యత్తును నిర్మించుకోవాలి

ప్రజాశక్తి తెనాలి :యువతలో నైపుణ్యాలను వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని, ఈ పోటీల ద్వారా యువత మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాట్మెంటన్ పోటీలను ఏఎస్ఎన్ ఇండోర్ స్టేడియంలో, అలాగే క్రికెట్ పోటీలను ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్ ఆవరణలో ఎమ్మెల్యే శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి విజ్వల భవిష్యత్తు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ ఎం జస్వంతరావు, వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్ ఎం సంధ్యారాణి, ఎం.రాజేశ్వరరావు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆడుదాం ఆంధ్ర

- జిల్లా వ్యాప్తంగా క్రీడా పోటీలు ప్రారంభం
- నరసరావుపేటలో క్రీడా జ్యోతిని వెలిగించిన కలెక్టర్, ఎమ్మెల్యే
- ఆటలాడి ఉత్సాహ పరిచిన ఎమ్మెల్యేలు

నరసరావుపేటలో క్రీడా జ్యోతితో కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జెసి ఎ.శ్యామ్‌ప్రసాద్, ఇతర అధికారులు, నాయకులు, రొంపిచర్లలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా విలేకర్లు

ప్రభుత్వం చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని జిల్లా క్రీడా ప్రాంగణంలో పోటీలను కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ప్రారంభించారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చేసి, క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జ్యోతిని వెలిగించి, బెలూన్లను ఎగరవేశారు. అతిథులు పలు ఆటలను ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. మేలైన క్రీడాకారులను తయారు చేయడానికి ఇది ఒక అద్భుతమైన అవకాశమని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీగాధికారి సురేశ్, పిఇటిలు, అధికారులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్ల జెడ్‌పి పాఠశాలలో క్రీడలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి కొద్దిసేపు ఆటలాడారు. జాతీయ స్థాయికి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు సిఎం కృషి చేస్తున్నారని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. తహశీల్దార్ జి.అంకారావు, ఎంపిపి జి.వెంకట్రావు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బి.రామకృష్ణ, వైపిపి హెచ్‌ఎం సుభాని, వైసిపి నాయకులు పాల్గొన్నారు. వినుకొండ పట్టణంలోని జూనియర్ కాలేజీలో పోటీలను ఎమ్మోల్యే బొల్లా బ్రహ్మనాయుడు, పెదకూరపాడు జెడ్‌పి పాఠశాలలో పోటీలను ఎమ్మెల్యే ఎన్.శంకరరావు ప్రారంభించారు. పలు ఆటలు ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. చిలకలూరిపేటలోని సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్లో పోటీలను వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రాణిస్తున్న క్రీడాకారులను రాజేష్ నాయుడు సత్కరించారు.

పెదకూరపాడులో వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్యే శంకరరావు, వినుకొండలో క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ సిహెచ్ గోవిందరావు, డిప్యూటీ డిఈవో కె.వేణుగోపాల్, అధికార భాషా సంఘం సభ్యులు కె.వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ కె.శ్రీనివాసరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు పి.తలహాఖాన్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ దరియావలి, సాదినేని చౌదరయ్య పాల్గొన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడు జెడ్‌పి పాఠశాలలో పోటీలను ఎంపిపి పి. ఝాన్సీ సాగర్ ప్రారంభించారు. సర్పంచ్ కె.హేమ, తహశీల్దార్ వైవిబి కుటుంబరావు, ఎంపిడిఒ వై.హనుమారెడ్డి, ఇఒపిఆర్‌డి వరూధిని పాల్గొన్నారు.

విన్నవించినా స్పందన లేనందునే సమ్మె

నరసరావుపేటలో మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మంగళవారం సమ్మె ప్రారంభించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని యూనియన్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ ప్రారంభించి మాట్లాడారు. సమస్యలపై కొన్ని నెలలుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పరిష్కరించని నేపథ్యంలో అనివార్యంగా సమ్మెకు దిగినట్లు చెప్పారు. కార్మికులకు ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను విస్మరించారని, కరోనా సమయంలో మున్సిపల్ కార్మికులు చేసిన సేవలు వెలకట్టలేని అని కీర్తించినా నామమాత్రపు జీతాలతో ఎలా బతుకుతారో మాత్రం ఆలోచించడం లేదని అన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.సాల్మన్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని, కారుణ్య నియామకాలు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. క్లాప్ వాహన డ్రైవర్లకు ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు ,కార్మికులకు భద్రతా పరికరాలు యూనిఫామ్, సబ్బులు, చెప్పులు, నూనె ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు యోహన్, పి.యేసు, మల్లయ్య, నరసింహారావు, అల్లాబక్షు, శేఖర్, సింగ్, వెంకట్, మహేష్, దీనమ్మ పాల్గొన్నారు.

ఇదే స్ఫూర్తితో మరిన్ని బాలోత్సవాలు నిర్వహించాలి

బాలల పండుగ విజయవంతంపై అభినందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు బాలోత్సవం కమిటీ 65 ఈవెంట్లలో జిల్లాస్థాయిలో బాలబాలికలకు ఈనెల 23, 24 తేదీలలో బాలోత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ అభినందనలు తెలియజేసింది. ఈ మేరకు అభినందన సభ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో మంగళవారం నిర్వహించగా పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఛైర్మన్ గుంటూరు విజయ్ కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షులు వి.కృష్ణయ్య, పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. సభకు పల్నాడు బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన పల్నాడు జిల్లాలో ఇంతపెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిoచడం గొప్ప విషయమన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లోనూ నిర్వహించాలని కోరారు. పోటీలను జయప్రదంగా నిర్వహించడానికి సహకరించిన బాలోత్సవం కమిటీ సభ్యులు రాజారెడ్డి, కట్ట కోటేశ్వరరావు, గౌస్ మొహిద్దిన్, నిర్వాహకులను అభినందించారు. సభలో విశ్రాంత హెచ్‌ఎం ప్రసాదు, ఎం.సాంబశివరావు, కె.శ్రీనివాసరావు, జిఎస్ఆర్, కస్తూర్బా స్కూల్స్ జిల్లా అధికారి డి.రేవతి, పల్నాడు విజ్ఞాన కేంద్రం సభ్యులు షేక్ మస్తాన్‌వలి, ఎ.గోపాలరావు, వై.రాధాకృష్ణ, ఎస్.ఆంజనేయ నాయక్, జి.రవిబాబు, ఎ.లక్ష్మీశ్వర్‌రెడ్డి, కె.రామారావు పాల్గొన్నారు.

సహకరించిన అందరికీ కృతజ్ఞలు : కట్టా కోటేశ్వరరావు

ఇదిలా ఉండగా బాలోత్సవాన్ని జయప్రదం చేసినందుకు కమిటీ సభ్యులకు కమిటీ కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రెండ్రోజులపాటు నిర్వహించిన పోటీలకు 15 వేల మంది హాజరయ్యారని, వివిధ ఈవెంట్స్‌లో 7700 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. మూడు విభాగాలకు (సబ్ జూనియర్, జూనియర్,సీనియర్) సంబంధించి మొదటి రోజు 4300 మంది, రెండవ రోజు 3400 మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. న్యాయ నిర్ణేతలుగా 40 మంది, ఆర్గనైజర్స్‌గా 65 మంది, వాలంటీర్స్‌గా 60 మంది, ఈవెంట్ ఏర్పాట్లలో మరో 60 మంది, ఆహ్వానితులు మరో 40 మంది మొత్తం 265 మందికిపైగా పోటీల నిర్వహణలో పాలుపంచుకున్నారని వివరించారు. వివిధ విభాగాల్లో మొత్తం 65 అంశాల్లో పోటీలు నిర్వహించగా ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు రెండు కన్సొలేషన్ బహుమతులు ప్రదానం చేసినట్లు తెలిపారు. గ్రూప్ ఈవెంట్స్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులను పాఠశాలకు పంపుతామని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న అందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇచ్చామని పేర్కొన్నారు. 'పల్నాడు బాలోత్సవం' పిల్లల పండుగ నిర్వహణలో ఆర్గనైజర్స్‌గా వ్యవహరించిన కమిటీ గౌరవాధ్యక్షులు ఎం.ఎస్.ఆర్.కె ప్రసాద్, అధ్యక్షులు 'ఆక్స్‌ఫర్డ్' రాజారెడ్డి, కోశాధికారి కోయ రామారావు, ఎస్‌సిఇఆర్‌టి టెస్ట్ బుక్ రైటర్ షేక్ మహమ్మద్ గౌస్, కమిటీ ప్రధాన బాధ్యులు మేడా సాంబశివరావు, ఎ.భాగేశ్వరిదేవి, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, జిఎస్ఆర్‌కు, సహకరించిన దాతలకు, అధికారులకు, ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు, న్యాయ నిర్ణేతలకు, వాలంటీర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అభినందన సభలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

కలెక్టరేట్ వద్ద రేపు విఆర్ఎల దీక్ష

ప్రజాశక్తి - పెదకూరపాడు

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారం కోసం నరసరావుపేటలోని కలెక్టరేట్ ఎదుట గురువారం చేపట్టే నిరసన దీక్షకు విఆర్ఎలు తరలిరావాలని వీఆర్ఏల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ పిలుపునిచ్చారు. 2017 మార్చి 24వ తేదీన ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి విజయవాడలోని అలంకార్ సెంటర్లో వీఆర్ఏల దీక్ష శిబిరానికి వచ్చారని, తాను అధికారంలోకి వచ్చిన వారంలోనే వీఆర్ఏల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికీ విఆర్ఎల సమస్య ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని, ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదని అన్నారు. వీఆర్ఏలకు పే స్కేలు వర్తింపజేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన రూ.500ను 2018 జూన్ నుండి వేతనంతో కూడిన డిఎగా తక్షణమే కొనసాగించాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. ఈ మేరకు నాయకులతో కలిసి తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు.

బ్రిడ్జి పనులు రెండు నెలల్లో పూర్తవ్వాలి

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని పెదమద్దూరు వద్ద ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న బ్రిడ్జి, అమరావతి - తుళ్లూరు డబుల్ లైన్ రోడ్డు నిర్మాణ పనులు పున:ప్రారంభమైన నేపథ్యంలో వాఆటిని ఎమ్మెల్యే ఎన్.శంకరరావు మంగళవారం పరిశీలించారు. ఎన్‌డిబి ఫేజ్-1 గ్రాంట్ కింద రూ.44 కోట్లతో పెదమద్దూరు బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా వర్షాలు, తుపాన్ల నేపథ్యంలో నీరు అధికంగా వచ్చి పనులు నిలిచాయి. కాంట్రాక్టర్లు, అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల : ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం ఖర్చును రూ.25 లక్షలకు పెంచుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మరో గొప్ప పని చేశారని ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను రైల్వేస్టేషన్ రోడ్డు సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఆడ్మిన్ శ్రీలక్ష్మీ, ఆరోగ్య శాఖ సిబ్బంది శిరీష, శ్రీనివాసరావు, నిర్మల, నాగరాజకుమారి, పుష్ప పాల్గొన్నారు.

ఇవిఎంలపై రేపటి నుండి అవగాహన

ప్రజాశక్తి - పెదకూరపాడు, నకరికల్లు : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఇవిఎం) ద్వారా ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో బుధవారం నుండి అవగాహన కల్పిస్తామని పెదకూరపాడు, నకరికల్లు తహశీల్దార్లు జియా, నగేష్ తెలిపారు. ఈ మేరకు మంగళ వారం వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు. 9వ తేదీ వరకూ అన్ని గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తామని, ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోరారు.

మాటలు మనకు... మూటలు వాళ్లకు

మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపిన కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి ఆంద్ర మాల్యాద్రి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలు చేసి అమలు జరపకుండా మాటల గారడీ మనకు చూపించి, మూటలు మాత్రం పెద్దలకు అప్పజెబుతున్న జగన్ సర్కార్ ఇప్పటికైనా కళ్లు తెరవాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి హెచ్చరించారు. తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు మంగళవారం తాడేపల్లి పట్టణం, రూరల్, రాజధాని గ్రామాలకు చెందిన మున్సిపల్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. వారినుద్దేశించి మాల్యాద్రి మాట్లా డారు. పెద్దఎత్తున మున్సిపల్ కార్మికులు అక్కడకు చేరుకోవడంతో సమ్మె శిబిరం కిటకిటలాడింది. మున్సిపల్ కార్మికుల ఏమీ గొంతెమ్మ కోరికలు కోరడంలేదని మాల్యాద్రి చెప్పారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ సంపదను అంబానీ, ఆదానీలకు కట్టబెడుతున్న ప్రభుత్వాలు తెల్లవారు జామున లేచి వీధులన్నీ శుభ్రం చేస్తున్న మున్సిపల్ కార్మికులకు పనికి తగిన సమాన వేతనం ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో వేతనాలు పెరిగేంత వరకు కార్మికులు పోరాడాలన్నారు. కార్మిక వర్గంలో చీలికలు తేవడానికి పాలక పార్టీల ప్రయత్నిస్తాయని, వీటిని ధీటుగా ఎదుర్కోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు, రైతు సంఘం నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కొట్టె కరుణాకరరావు, పల్లెపు కృష్ణ, కె.మేరి పాల్గొన్నారు.

ఎర్రబాలెంలో దీక్షలు

ప్రజాశక్తి-తెనాలి :మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె కార్యాచరణలో భాగంగా జిల్లా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పురపాలక సంఘ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు, గాంధీచౌక్, బోస్‌రోడ్డు, వహాబ్‌రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. యూనియన్ ప్రధాన కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని, చనిపోయిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని, పెరిగిన పని భారానికి తగినట్లుగా కార్మికులను నియమించాలని, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే సిబ్బందికి రిస్క్, హెల్త్ అలవెన్స్ చెల్లించాలని ఇఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఎన్ని సార్లు వివరించినా ప్రభుత్వం నుంచి స్పందనలేదని, విధిలేని పరిస్థితిలోనే సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్‌వలి, రాచూరి పద్మ, రాచూరి వెంకటేశ్వర్లు, ఉన్నవ సుధాకర్, మెండాల నాగరాజు, డి.రమణమ్మ, ఎం.పద్మావతి, రెడ్డి రామయ్య, పి.భాస్కర్, ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి : ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళగిరిలో మంగళవారం సమ్మె ప్రారంభ మైంది. సమ్మె శిబిరాన్ని మంగళగిరి తాడేపల్లి నగరపాల సంస్థ మంగళగిరి కార్యాలయం ఎదుట ఏర్పాటు చేశారు. కొంతమంది కార్మికులు పనిలోకి పాల్గొని చెత్తను తీసుకు వస్తుండగా కార్మికులు అడ్డుకున్నారు. మున్సిపల్ కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ అధికార యంత్రాంగం సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి అనేక ప్రయత్నాలు చేస్తుందని కార్మికులు అది గమనించి సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు ఎం పకీరయ్య సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. యూనియన్ నాయకులు వై శివ నాగేశ్వరరావు, కురగంటి యేసు, ఎస్ శాంతి, శివ నాగేశ్వరమ్మ, ఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

తమను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు సమ్మె చేపట్టారు. ఎర్రబాలెం శివాలయం ఎదుట ధర్నా చేశారు. వీరికి సిపిఎం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను దేవుళ్ళని పొగిడిన రాష్ట్ర ముఖ్యమంత్రి కార్మికుల సమస్యలను గాలికి వదిలేయడంతో, గత్యంత లేని పరిస్థితిలో నేటి నుండి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టవలసి వచ్చిందని అన్నారు. తక్కువ జీతంతో ఎక్కువ పని చేపిస్తున్నారని, తమ ప్రాణాలను పణంగా పెట్టి చెత్త,మురికిలో పనిచేస్తున్న విలీన గ్రామాల మున్సిపల్ కార్మికులకు హెల్త్ అలివేన్స్ కూడా చెల్లించడం లేదని అన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎర్రబాలెం మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరం వద్దకు టిడిపి నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు, సిపిఎం ఎర్రబాలెం గ్రామ కార్యదర్శి అత్తలూరి వీర వెంకయ్యలు వచ్చి మద్దతు తెలిపారు. కాజ గ్రామంలో పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించి దీక్ష చేపట్టారు. దీక్షలకు సి ఐ టి యు నేతలు బి. కోటేశ్వరి, మాధవ రెడ్డి, సత్యమారెడ్డి, రామయ్య, డి. శ్రీనివాసరావు, నాగేంద్ర బాబు తదితరుల మద్దతు తెలిపి ప్రసంగించారు.

తెనాలిలో మున్సిపల్ కార్మికుల ర్యాలీ

ఎంటిఎంసి వద్ద సమ్మె శిబిరంలో మున్సిపల్ కార్మికులు

మంగళగిరిలో

కాజలో

ఆశా ల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - తుళ్లూరు

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటి యు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్య రాజు కోరారు.ఈ మేరకు ఆశా లతో కలిసి మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం లో వినతిపత్రం ఇచ్చారు. కనీస వేతనం అమలుతో పాటు ఒకేసారి వేతనం చెల్లించాలని,రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ 5 లక్షలు,ఫించన్ రూ 10 వేలు ఇవ్వాలని తదితర డిమాండ్ లతో వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్ల యూనియన్ మండల కార్యదర్శి రెబ్కా లక్ష్మి పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న శివారెడ్డి, వేమారెడ్డి.

తాడేపల్లిలో క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి పట్టణంలోని కెసి వర్క్స్ హైస్కూల్లో మంగళవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రారంభమైంది. ఎంటిఎంసి కార్పొరేషన్ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా పెద్దఎత్తున క్రీడలు ప్రోత్సహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి, ఉండవల్లి పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణకుమారి, కె.సంజీవరెడ్డి, యు.కల్యాణ్‌కుమార్, పిచ్చిరెడ్డి, ఎం.సంజీవరెడ్డి, కె.సాంబిరెడ్డి, ఎం.అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ దోపిడికి వ్యతిరేకంగా ధూళిపాళ్ల పాదయాత్ర

ప్రజాశక్తి - చేబ్రోలు :రాష్ట్ర ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు కిలారు వెంకట రోశయ్య రూ. 2200 కోట్ల విలువైన గ్రావెల్‌ను దోచుకున్నారని టిడిపి సీనియర్ నేత పొన్నూరు మాజీ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ విమర్శించారు మండలంలో గ్రావెల్ దోపిడికి వ్యతిరేకంగా నరేంద్ర కుమార్, పార్టీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున పాదయాత్రను చేపట్టారు. చేబ్రోలు మండలం శేకూరు, వీరనాయకుని పాలెం, చలపాడు, వేజెండ్ల, సుద్దపల్లి, చేబ్రోలు, వడ్లమూడి సమీప గ్రామాలలో పాదయాత్ర నిర్వహించిన అనంతరం నరేంద్ర కుమార్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య భాగస్వామ్యంతో గ్రావెల్ దోపిడీ యదేచ్ఛగా చేబ్రోలు మండలంలో సాగుతుందని తెలిపారు. ఏడు వందల ఎకరాల్లో సుమారు 125 కోట్ల టన్నుల గ్రావెల్‌ను గత నాలుగున్నర ఏళ్లలో అధికారంతో దోచేశారన్నారు. అక్రమ గ్రావెల్ పై ఎన్నిసార్లు స్పందన కార్యక్రమంలో అర్జీలు పెట్టినా, బాధిత గ్రామ ప్రజలతో పోరాటాలు చేసినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని ఏద్దేవా చేశారు. ఉద్యాన పంటలకు ప్రసిద్ధిగాంచిన ఈ ప్రాంతం అని, గ్రావెల్ దోపిడీతో ఉద్యాన పంటల విస్తీర్ణం రోజు రోజుకు తరిగి పోతుందని చెప్పారు. 2019-20 సంవత్సరంలో ఈ ప్రాంత రైతాంగం 1227 ఎకరాల్లో ఉద్యాన పంటలు వేశారని, 2020-21 సంవత్సరంలో 665 ఎకరాలకు ,2021-22 సంవత్సరంలో 545 ఎకరాలకు తగ్గుపోయిందని చెప్పారు. అధికారిక లెక్కల ప్రకారం సుమారు రూ. 5 కోట్ల పెనాల్టీ విధించారని, అయినా అక్రమార్కుల నుంచి ఒక రూపాయి కూడా వసూలు చేయలేదని తెలిపారు. ఐదు క్వారీల లీజుల్లో మాత్రమే ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ తీసుకున్నప్పటికీ అన్నీ క్వారీలలో నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా గ్రావెల్ తవ్వేశారని తెలిపారు. పర్యావరణం పాడైపోతున్నా ,పొలాలు నిస్సారంగా మారుతున్నా, భూగర్భ జలాలు కలుషితమవుతున్నా పట్టించుకొనే దిక్కులేకుండా పోయిందని నరేంద్ర కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చేస్తున్న ఈ పోరాటానికి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, రాష్ట్ర గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజామాష్టార్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అన్నాబత్తుని జయలక్ష్మి, జనసేన పొన్నూరు నియోజకవర్గ ఇంచార్జ్ మార్కండేయ బాబు, స్థానిక టిడిపి నాయకులు సంఘీభావాన్ని తెలియజేస్తూ పాదయాత్రలో కలిసి నడిచారు.

ఇన్‌ఛార్జి ఎపిపిల నియామకం

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

రాష్ట్రవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో టెన్యూర్ ఎపిపిలుగా పనిచేస్తున్న వారి మూడు సంవత్సరాల కాలపరిమితి పూర్తికావటంతో వారి స్థానంలో ఇన్ చార్జిలను నియమించారు. గుంటూరు 3వ అదనపు జిల్లా కోర్టు ఎపిపి వి.సూరిబాబు స్థానంలో 4వ అదనపు జిల్లా కోర్టులో డెకాటి కేసుల స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న వట్టిజొన్నల బ్రహ్మారెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమించారు. గుంటూరు ఫ్యామిలీ కోర్టు ఎపిపి సి.హెచ్.వి. సత్యనారాయణ స్థానంలో ఇన్‌చార్జిగా గుంటూరు రెండో జిల్లా కోర్టులో పనిచేస్తున్న డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పాతూరి మధుసూదనరావును నియమించారు. తెనాలి 12వ అదనపు జిల్లా కోర్టులో పనిచేస్తున్న డి.మోహన్‌రెడ్డి స్థానంలో తెనాలి ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు ఎపిపిని నియమించారు.

ఆళ్ళకు వాగ్ధేవి కళాపీఠం కవి సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

ఆళ్లను సత్కరిస్తున్న కళాపీఠం బృందం

పట్టణానికి చెందిన కవి, రచయిత ఆళ్ళ నాగేశ్వరరావు వాగ్దేవి కళాపీఠం నుంచి కవి సత్కారం పొందారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన కళాపీఠం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. కవి సమ్మేళనంలో ఆళ్ళ వినిపించిన వచన కవితకు విశేష స్పందన లభించిందని, పీఠం వ్యవస్థాపకులు డాక్టర్ యుగంధా చార్యులు, కవి పాలపర్తి శ్యామలానందప్రసాద్, పి.వెంకట రమణాచార్యులు, డాక్టర్ జివి పూర్ణచంద్, డాక్టర్ కెఆర్‌జి శేషు కుమార్ సమక్షంలో కవి సత్కారం గావించినట్లు చెప్పారు. ఈసందర్భ:గా ఆళ్ళను పట్టణానికి చెందిన పులువురు సాహితీ ప్రియులు అభినందించారు.

శ్రీనాధుడు నాటక వ్యాఖ్యాత ఆయినాలకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి :శ్రీనాధుడు నాటక వ్యాఖ్యాతగా వ్యవహరించిన పట్టణానికి చెందిన కవి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత డాక్టర్ ఆయినాల మల్లేశ్వం ్రావును గుమ్మడి గోపాలకృష్ణ ఫౌండేషన్ సత్కరించింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో గుమ్మడి గోపాలకృష్ణ ఫౌండేషన్ 3వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా హైదరాబాద్‌కు చెందిన సత్యసాయి కళానికేతన్ బృందం శ్రీనాధుడు పద్యనాటకాన్ని ప్రదర్శించారు. నాటకానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన డాక్టర్ అయినాలను సిలికాన్ ఆంధ్రా అధ్యక్షులు కూచిబొట్ల ఆనందకుమార్ ప్రత్యేకంగా సత్కరించినట్లు మంగళవారం తెలిపారు.

బిజెపికి జగ్గారపు గుడ్ బై

ప్రజాశక్తి -మంగళగిరి: భారతీయ జనతా పార్టీ వీవర్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్ జగ్గారపు రామ్మోహన్ రావు (రాము) తన పదవికి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పాత మంగళగిరిలోని ఆయన నివాసంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగ్గారపు రాము వివరాలు వెల్లడించారు. తన రాజీనామా లేఖను బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరికి పంపానని ఆయన తెలిపారు.

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

మమ్మలనేని అరుణ్, కౌన్సిలర్, హ్యాంప్ షెయిర్ స్టేట్, ఇంగ్లాండ్

ప్రజాశక్తి- పెదనందిపాడు

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని ప్రవాస భారతీయుడు ముమ్మల నేని అరుణ్ అన్నారు. మంగళవారం పెదనందిపాడు లోని లయన్స్ మాంటిస్సోరి స్కూల్లో జరిగిన విద్యార్థుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అందరిలో ఒకరిలా కాకుండా తమ ప్రత్యేకతను విద్యార్థులతు నిరూపించుకోవాలన్నారు. ఒత్తిడి లేకుండా చదువు కొనసాగించాలని, అదేవిధంగా సామాజిక బాధ్యత పెంపొందించుకోవాలని సూచించారు, ఇంగ్లాండ్‌లో కౌన్సిలర్‌గా ఉంటూనే, సాఫ్ట్వేర్ కంపెనీని నడుపుతున్నానని, అక్కడ తెలుగు భాష అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం దాసరి శేషగిరి రావు, ముద్దన నగరాజకుమారి, అరవపల్లి కృష్ణమూర్తి, ముద్దన రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మంగళవారం గుంటూరు సమీపంలోని నల్లపాడు వద్ద ఉన్న లయోలా పబ్లిక్ స్కూల్ క్రీడ మైదానంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా 2023 పోటీల ప్రారంభోత్సవానికి విచ్చేసిన సిఎం జగన్‌కు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు,క్రీడా ప్రముఖులు ఘన స్వాగతంపలికారు. మంత్రులు ఆర్‌కె రోజా, అంబటి రాంబాబు, విడదల రజనీ, మేరుగ నాగార్జున, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెనీ క్రిస్టీనా, రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి, మర్రిరాజశేఖర్, కెఎస్ లక్ష్మణరావు, మురుగుడు హనుమంతరావు, కల్పలతా రెడ్డి, తలసిల రఘురాం, రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రధ్యుమ్నా, జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి, శాప్ మేనేజింగ్ డైరక్టర్ హెచ్ ఎం ద్యానచంద్రా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్ధ రెడ్డి, మేయరు కావటి శివనాగ మనోహర నాయుడు, శాసనసభ్యులు మేకతోటి సుచరిత, కిలారి వెంకట రోశయ్య, అన్నబత్తిని శివకుమార్, మద్ధాళి గిరిధర్, మహమ్మద్ ముస్తఫా, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్ , సమాచార కమిషనర్ శామ్యూల్ జోనథన్, అంతర్జాతీయ క్రీడాకారులు కిడాంబి శ్రీకాంత్ , మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, డిసిసిబి చైర్మన్ రాతంశెట్టి సీతారామంజనేయులు, క్రిస్టియన్ ఎఫైయిర్స్ సలహాదారులు బాలస్వామి, డిప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్ సజీలా, ఆర్డీవో కె శ్రీఖర్, క్రీడాకారులు, వైసిపి కత్తెర సురేష్, నూరి ఫాతిమా, చైతన్య పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

ముఖ్యమంత్రికి స్వాగతం చెబుతున్న విడదల రజని

ముఖ్యమంత్రికి స్వాగతం చెబుతున్న మేకతోటి సుచరిత

విద్యార్థి, యువజన సంఘాల నేతల అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ఉద్యోగ భద్రత లేక యువత భవిష్యత్ ప్రశార్ధకంగా మారి బలవన్మరణాలకు పాల్పడుతుంటే పట్టించుకోకుండా ఎన్నికల ముందు ఆడుదాం ఆంధ్ర పేరుతో సిఎం జగన్ ప్రజలను మభ్యపెడుతున్నారని తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ విమర్శించారు. మంగళవారం నల్లపాడులో సిఎం జగన్ పర్యటనను పురస్కరించుకుని పలు విద్యార్థి, యువజన సంఘాలనేతలు స్థానిక చుట్టుగుంట సెంటర్‌లో నిరసన తెలిపారు. జాబ్ కేలండర్ పేరుతో మోసం చేశారని ఆరోపించారు. ఈసందర్భంగా పోలీసులు పలువురు నేతలను అరెస్టు చేసి నగరంపాలెం పోలీసు స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం 2 గంటలకు విడుదల చేశారు. పోలీసుల అరెస్టుకు నిరసనగా గోబ్యాక్ సీఎం నినాదాలు చేశారు. 'అడుగుదాం ఆంధ్ర .. ఇది ఉద్యోగాల వేట నిరుద్యోగుల మాట' పేరుతో వ్రాసి ఉన్న తెలుపు టి షర్టు ధరించి రాష్ట్రంలో నిరుద్యోగులకు కావాల్సింది ఉద్యోగాలే కానీ పరీక్షల సమయంలో ఆటలు కాదని జాబ్ క్యాలెండరు ఇవ్వాలి, రాష్ట్రంలో క్రీడా మైదానాలు బాగు చెయ్యాలని డిమాండ్‌లతో తెలుగుయువత,యువజన కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ ల ఆధ్వర్యంలో గుంటూరులో నల్లపాడు లయోలా కాలేజికి "ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి వస్తున్న ముఖ్యమంత్రి జగన్ కు వినతి పత్రం ఇవ్వాలని తలంపుతో లయోలా స్కూల్ గ్రౌండ్‌కి వెళ్తున్న నాయకులను పోలీసులు నియంత్రించారు. జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె పవన్ తేజ, ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షులు షేక్ కరీం లతో పాటు యువజన విద్యార్థి నాయకులను పోలీసులు చుట్టుగుంటలో అడ్డుకొని బలవంతంగా ఈడ్చుకెళ్లి అరెస్ట్ చేసి నగరం పాలెం స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన యువజన నేతలను కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి,గుంటూరు పశ్చిమ టిడిపి ఇంచార్జ్ కోవెలమూడి రవీంద్ర,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లింగంశెట్టి ఈశ్వరారావులు పరామర్శించారు అనంతరం అరెస్టు అయిన 20 మంది నేతలను వ్యక్తిగత పూచి కత్తు పైన విడిచి పెట్టారు.

గుంటూరులో దీక్షల్లో పాల్గొన్న న్యాయవాదులు

ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి

- న్యాయవాదుల రిలే దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం గుంటూరు జిల్లా కోర్టు ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ దీక్షల్లో మొదటిరోజు గురజాల అనురాధ, వి.ఉషాకిరణ్‌రెడ్డి, లావు కిరణ్మయి, నల్లూరి నరసింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ ప్రజాహక్కులకు వ్యతిరేకమైన ఈ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. నేడు న్యాయవాదులు ప్రదర్శనగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమంలో ప్రతి న్యాయవాది హాజరు కావాలని పిలుపునిచ్చారు. దీక్షల్లో ఉద్యమ కమిటీ సభ్యులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వినదాయకం.. వినోదాత్మకం

ఆకట్టుకుంటున్న నంది నాటకోత్సవాలు

భారీగా హాజరు అవుతున్న ప్రజలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర స్థాయి నంది నాటకోత్సవాలలో భాగంగా నాల్గో రోజు మంగళవారం కళాకారులు పలు నాటికలను ప్రదర్శించారు. గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్న నాటికలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. ప్రజలు భారీగా తరలివస్తున్నారు. తొలుత సీతాకల్యాణం పౌరాణిక పద్యనాటకం ప్రదర్శించారు. రామాయణంలో సీతా కల్యాణం నేపథ్యాన్ని ప్రదర్శించారు. తథాబాల్యం బాలల నాటికలో అమ్మ సెంటి మెంట్, నేటి బాలల్లో సాంకేతిక పరిజ్ఞానం మీద ఉన్న ఆసక్తి, డోరేమాన్ లాంటి ఒక బొమ్మ రోబోను తయారు చేసి దానికి మరణించిన తన తమ్ముడు డుంబు పేరు పెట్టి డుంబు కోసం రోదిస్తున్న తల్లిని ఆబొమ్మతో ఓదార్చటం తదితర సనినవేశాలలో బాలలు మంచి నటనను కనబరచారు. తల్లిబిడ్డ కోసం రోదించే సన్నివేశాలు ప్రేక్షకుల చేత కంటతడి పెట్టించాయి. బొమ్మను తయారు చేసిన హర్ష ఫ్రెండ్స్ తోనూ కలిసిపోయి ఆడుతూ పాడుతూ కాలం గడిపేస్తున్న ఆ బొమ్మ సమాజంలో పెద్దలకొక నీతి, చిన్నలకొక నీతిలా పరిస్థితులుండటం చూసి తట్టుకోలేక పోతుంది. పిల్లలకు బుద్ధిచెప్పాల్సిన పెద్దలు తప్పుదోవలో నడవ కూడదని సందేశమిచ్చింది ఈ నాటిక. ది ఇంపోస్టర్స్ (అంతా నిజమే చెబుతారు) నాటికలో ఒంటరిగా జీవనాన్ని సాగించే ఒక మామూలు ఆడపిల్ల కథ. పదిమంది కోసం ప్రశ్నించడమే అలవాటు చేసుకున్న ఆడపిల్ల జీవితంలోకి ధనవంతుల క్రౌర్యం, వంచన, హింస ఎలా ప్రవేశిస్తాయో, వాటి ప్రభావంగా ఆ ఆడపిల్ల జీవితం ఎలా ముగిసిపోయిందో తెలియజేసే విషాద గాధను ప్రదర్శించారు. అలకనంద అనే ఆడపిల్ల కుటుంబం నివాసం ఉన్న చోట ఒక పెద్ద మాల్ కట్టేందుకు ప్రభుత్వం ఒక పెట్టుబడిదారుడికి అనుమతి ఇచ్చింది. కుటుంబంలోని ప్రతి వ్యక్తికీ ఉద్యోగం ఇస్తాననే హామీతో అతను అక్కడ మాల్ నిర్మిస్తాడు. అయితే చదువుకున్న వాళ్లకీ, చదువులేని వాళ్లకీ కూడా సెక్యూరిటీ గార్డులుగానే ఉద్యోగాలు ఇస్తాడు. జీతాలు పెంచడు. జనాన్ని పోగుచేసి అతను చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తుంది అలకానంద. దాని ఫలితంగా ఉద్యోగంకోల్పోయిన ఘటనలను ప్రదర్శించారు. ఇంకానా? నాటికలో ఆద్యంతం ఆకట్టుకుంది. ఆచారం పేరుతో అనైతికత, అసమంజసత్వం, అన్యాయం, రకరకాల రూపాల్లో స్వార్థ, సంకుచిత, అమానవీయ శక్తుల రూపాల్లో ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలను వేధిస్తున్న తీరును ప్రదర్శించారు.

ఆస్తికలు నాటికలో ఆస్తులు సమకూర్చుకోవడం డబ్బులు పోగేసుకోవడం సమస్త జీవజాలంలో మనిషికొక్కడికి మాత్రమే ఉన్న విపరీత లక్షణం. ఇది అవాంఛనీయం, ప్రకతి విరుద్ధమని చాటి చెప్పిన నాటిక ఇది. బతికినంతకాలం ఆస్తులు పోగెయ్యడమే లక్ష్యంగా బ్రతికిన బసవయ్యకు చచ్చి దెయ్యమయ్యాక గానీ తన జీవితం ఎంత నికష్టమైందో అర్థం కాలేదు. తన పిల్లలు కూడా తనలాగే ఆస్తుల కోసం వెంపర్లాడటం చూసి.... బసవయ్య ఆత్మ ఎంత క్షోభ పడిందో ఆసక్తికరంగా నాటికలో కనిపించింది. శ్రీకృష్ణ - కమలపాలిక పద్యనాటకం ప్రదర్శించారు. ఎఫ్‌డిసి చైర్మన్ పోసాని కృష్ణమురళీ, మేనేజింగ్ డైరక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి విజేతలకు బహుమతులు, పారితోషకం అందచేశారు.

'ఇంకానా' సాంఘిక నాటికలో దృశ్యం

సీతా కళ్యాణంలో దృశ్యం

హాజరైన ప్రేక్షకులు